సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



కుష్టు నిర్మూలనే లక్ష్యం

సిరిసిల్లటౌన్: జిల్లాలో ఈనెల 16 నుంచి 31 వరకు కుష్టు నిర్మూలన కార్యక్రమం ఎల్‌సీడీసీని చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు తెలిపారు. 476 టీములు సర్వే చేస్తాయని తెలిపారు.



నీటి విడుదల నిలిపివేత

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి సోమవారం నీటి విడుదల నిలిపివేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 20.32 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



కలెక్టర్ అనురాగ్ జయంతికి మొక్క అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆయాజ్

సిరిసిల్ల: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన మహ్మద్ ఆయాజ్ సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలెక్టరేట్‌లో కలిశారు. కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై సిరిసిల్లకు వచ్చిన ఆయాజ్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. అనంతరం అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్‌లను కలిసి పూలమొక్కలు అందించారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన మహ్మద్ అయాజ్‌కు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధురాలిని రక్షించిన పోలీసులు



వృద్ధురాలిని తరలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆత్మహత్య చేసుకోవాలని వెళ్లిన వృద్ధురాలిని తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ నరేందర్ రక్షించారు. తంగళ్లపల్లిలోని ఇందిరానగర్‌కు చెందిన ఎళ్లోల్ల చంద్రవ్వ(85) మానేరునదిలో వంతెన పై నుంచి దూకేందుకు యత్నిస్తుండగా గమనించిన పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోబోయినట్లు చంద్రవ్వ పోలీసులకు తెలిపింది. కుటుంబ సమస్యలు చుట్టుముట్టడంతోనే మనోవేదనకు గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చంద్రవ్వ తెలిపింది. వృద్ధాశ్రమానికి పంపిస్తామని పోలీసులు తెలపగా.. తన కొడుకు వద్దనే ఉంటాననడంతో ఇంటికి పంపించారు. వృద్ధురాలిని కాపాడిన తంగళ్లపల్లి ఎస్సై వెంటేశ్వర్లు, కానిస్టేబుల్ నరేందర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

వర్కర్ టు ఓనర్ అమలేది?



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సిరిసిల్ల నేతకార్మికులను 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని రాష్ట్ర సర్కారు వెంటనే అమలు చేయాలని కోరుతూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్లలో పాదయాత్ర చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు మూశం రమేశ్ మాట్లాడుతూ కార్మికులను యజమానులను చేస్తామన్న సర్కారు మాట నిలుపుకోలేదన్నారు. ప్రభుత్వానికి, మంత్రి కేటీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా నెలలోపు వర్కర్ టు ఓనర్ పథకం యూనిట్లను ప్రారంభించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాసు, గుండు రమేశ్, శ్రీపతి ముని తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వెల్జిపూర్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడి పనులను సోమవారం పరిశీలించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఇల్లంతకుంట ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంఈఓ బన్నాజీ తదితరులు ఉన్నారు.

మాతృదేవో భవ

- గర్భిణులకు ఆత్మీయ వైద్యసేవలు
- సర్కారు ఆస్పత్రుల్లో సత్వర సేవలు
- సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రుల్లో 13 మంది పీఆర్‌వోలు
- సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపే లక్ష్యం
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టు
- నేడు వేములవాడలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

'కోనరావుపేట మండలం వట్టిమల్ల గిరిజనతండాకు చెందిన గర్భిణి ప్రియాంక (24). ఏడు నెలలు నిండడంతో వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యపరీక్షల కోసం తన అత్తమ్మ భూలితో కలిసి వచ్చింది. ప్రియాంక పదోతరగతి వరకు చదువుకున్నా వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎవరిని కలవాలి? లేడీ డాక్టర్ ఎక్కడ ఉంటారు? బీపీ ఎక్కడ చూపించుకోవాలో తెలియదు. తన వెంట వచ్చిన అత్తమ్మ భూలికి చదువురాదు. ఆస్పత్రి ప్రాంగణంలోనే ఉన్న ఓ యువతి ప్రియాంకను, ఆమె అత్తను సమీపించింది. ఎన్నో నెల అంటూ.. నవ్వుతూ ప్రశ్నించి ఓపీ చిట్టి రాయించడం నుంచి వైద్యపరీక్షలు చేయించడం, చివరికి మందులు ఇప్పించడం వరకు ఓ మూడు గంటలపాటు సదరు యువతి(పీఆర్‌వో) అన్ని చూసుకుంది. ఇవన్నీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే పూర్తవడంతో ప్రియాంక ఆమె అత్తమ్మ భూలి సంతోషంగా ఇంటి దారి పట్టారు..' ఇలా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి సేవలను, ప్రసవాల సంఖ్య పెంచేందుకు సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెల్త్ సూపర్‌వైజర్లను పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు(పీఆర్‌వో)గా నియమించారు. 13 మంది పీఆర్‌వోలు రేయింబవళ్లు అందుబాటులో ఉండి గర్భిణులు, బాలింతలకు సహకరిస్తారు.



గర్భిణిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న ఆస్పత్రి సిబ్బంది



వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో పీఆర్‌వోలు



గర్భిణి వివరాలు నమోదు చేయిస్తున్న సహాయకులు

సిరిసిల్ల: 'మాతృ సేవా' పేరుతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్రంలోనే తొలిసారి పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య 62 శాతం ఉంది. దీన్ని 80 శాతానికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు మార్గదర్శనంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఈ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గర్భిణులకు సహాయకారిగా ఉండేందుకు సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రుల్లో 13 మంది పీఆర్‌వోలను నియమించారు. వీరు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ గర్భిణుల వివరాల నమోదు నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు స్వయంగా వెంట ఉండి అందిస్తారు. పీఆర్‌వో సేవలతో ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకం పెంచడం, ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెంచడమే లక్ష్యం.

సిరిసిల్లలో 8.. వేములవాడలో ఐదుగురు

సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో ఎనిమిది మంది, వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో ఐదుగురు పీఆర్‌వోలను నియమించారు. వీరిని సులభంగా గుర్తించేందుకు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ సూపర్‌వైజర్ల(పీఆర్‌వో)లకు సహాయకులుగా నర్సింగ్ కాలేజీ విద్యార్థులుంటారు. గర్భిణులు ఆస్పత్రికి రాగానే నవ్వుతూ ఆత్మీయంగా మాట్లాడడం.. ప్రేమపూర్వకంగా వైద్యసేవలు అందే విధంగా చూడడం వీరి విధి. ఈ విధానంపై ఇప్పటికే హెల్త్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చి వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహించారు.

నేడు వేములవాడలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు 'మాతృసేవా' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈమేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భిణులకు సేవలందించే పైలట్ ప్రాజెక్టుకు మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టనున్నారు.

80 శాతం ప్రసవాలు లక్ష్యం



జిల్లాలో ప్రస్తుతం 62 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి. దీన్ని 80 శాతానికి పెంచేందుకు 'మాతృసేవా'ను ప్రారంభిస్తున్నాం. రాష్ట్ర మంత్రి కేటీఆర్ మార్గదర్శనంలో డాక్టర్ల పర్యవేక్షణలో ఈ పైలట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాం. జిల్లాలో ఈ ప్రాజెక్టు సత్ఫలితాలను ఇస్తుందనే నమ్మకం మాకు సంపూర్ణంగా ఉంది.

– అనురాగ్ జయంతి, కలెక్టర్



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఘనంగా చేనేత దినోత్సవం

సిరిసిల్లటౌన్: అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కార్మికక్షేత్రం సిరిసిల్లలో సంబరాలు మిన్నంటాయి. అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీన్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పాతబస్టాండులోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, చేనేత సెల్ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు పాల్గొన్నారు. ప్రముఖ చేనేత శిల్పి నల్ల విజయ్‌ను పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మానించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో చేనేత కారుడు వెల్ది హరిప్రసాద్‌ను సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, గూడూరి భాస్కర్, నాగుల శ్రీనివాస్, శీలం రాజు, తడక విజయ్ పాల్గొన్నారు. హిందూ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కౌన్సిలర్ పత్తిపాక పద్మ, సమితి ప్రతినిధులు పత్తిపాక సురేష్, కూరపాటి శ్రీధర్ పాల్గొన్నారు. సామాజిక సమరసత వేదిక కన్వీనర్ మోర శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం నిర్వహించారు.

చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలి

చేనేతపై విధిస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కోరారు. సిరిసిల్లలో సోమవారం మీడియాతో మాట్లాడారు. సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికులకు వర్కర్ టు ఓనర్ పథకం అమలులో బీఆర్‌ఎస్ సర్కారు కాలయాపన చేస్తుందన్నారు. గతంలో కార్మికులకు 14వేల అంత్యోదయ కార్డులు ఇస్తే వాటిని తొలగించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కార్మికులు సరైన రీతిలో గుణపాఠం నేర్పుతారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నూలు డిపో ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బతుకమ్మ యారన్ సబ్సిడీ అందించాలని కోరారు. చేనేత శిల్పి నల్ల విజయ్‌ని సన్మానించారు.



నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న కళ



బీజేపీ ఆధ్వర్యంలో హరిప్రసాద్‌కు సన్మానం

ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

- బారులు తీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ బాట పడుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి బాధితులు భారీగా తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్ అనురాగ్ జయంతికి విన్నవించుకున్నారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రజావాణికి 62 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో వ్యర్థాలు పడేస్తున్నారు



సిరిసిల్లలోని రేణుకామాత శాఖంబరీ ఆలయాన్ని ఆనుకొని కొందరు వ్యక్తులు చేపలు విక్రయిస్తూ, వ్యర్థాలను గుడి ప్రాంగణంలో పడేస్తున్నారు. వాటి నుంచి వస్తున్న దుర్వాసన ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కల్గిస్తుంది. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – సిరిసిల్ల గౌడకులస్తులు

జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయండి



సిరిసిల్ల రగుడు, కలెక్టరేట్ చౌరస్తాలలో మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి. చౌరస్తాలలో విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

– జిల్లా ముదిరాజ్ సంఘం సభ్యులు

నగదు ఇవ్వండి



మా ఊరిలో అదనపు 1.1 టీఎంసీ వరద కాలువ నిర్మాణంలో దాదాపు 80 ఇళ్లను కోల్పోతున్నాం. అధికారులు వచ్చి సర్వే చేసి రెండు ఆప్షన్స్ ఇచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, వన్ టైం సెటిల్‌మెంట్ కింద నగదు అందజేస్తామని తెలిపారు. కానీ మాకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద నగదు అందజేస్తేనే అనువైన ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుంటాం.

– దేశాయిపల్లి గ్రామస్తులు(బోయినపల్లి)

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



మా సమస్యలు పరిస్కరించండి. ప్రాథమిక వైద్యశాలలో రెండో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న మాకు సమాన పనికి సమాన వేతనం రావడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులరైజ్ చేయాలి.

– ఏఎన్‌ఎంలు

కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు చాలాకాలం తర్వాత ఒకేవేదిక మీదికి వచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో ఐటీ మినిస్టర్ కేటీఆర్‌ను కలిశారు. అభివృద్ధి పనులపై చర్చించారు. చిత్రంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు సతీశ్ బాబు, రవిశంకర్, రసమయి, రమేశ్‌బాబు, మనోహర్‌రెడ్డి, సంజయ్‌కుమార్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు కౌశిక్‌రెడ్డి, భానుప్రసాద్, రమణ ఉన్నారు. – సాక్షి ప్రతినిధి, కరీంనగర్

నేడు మంత్రి కేటీఆర్ వేములవాడకు రాక

వేములవాడ: వేములవాడలో రూ.100 కోట్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు మంత్రి కేటీఆర్ మంగళవారం వస్తున్నారు. ఉదయం 10 గంటలకు నందికమాన్ జంక్షన్‌ను ప్రారంభిస్తారు. 10.30 గంటలకు చింతల్‌ఠాణా శివారులోని 42 డబుల్ ఇళ్లను ప్రారంభిస్తారు. 11 గంటలకు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, మాతృసేవా సెంటర్, బయోగ్యాస్ ప్లాంట్, 11.30 గంటలకు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద మిషన్ భగీరథ పనులు, 12 గంటలకు మూలవాగు ఒడ్డున నిర్మించిన పార్క్, వాకింగ్‌ట్రాక్, 12.30 గంటలకు శ్యామకుంటలోని వెజ్‌మార్కెట్‌ను ప్రారంభిస్తారు. 12.45 గంటలకు గుడిచెరువులో శివార్చన స్టేజీ, ఒంటి గంటకు బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు, 1.30 గంటలకు భక్తుల సౌకర్యార్థం నిర్మించే వందగదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో భోజనం అనంతరం బీసీబంధు చెక్కులు అందజేస్తారు.

దెబ్బతిన్న పల్లెరోడ్లు

- భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో రహదారులు ధ్వంసం
- కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ
- నష్టం అంచనాలు రెడీచేసిన పీఆర్ విభాగం
- మరమ్మతులకు దాదాపు రూ.188 కోట్లు



ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట-జవారిపేట గ్రామాల మధ్య బిక్కవాగుపై తెగిన కాజ్‌వే

జిల్లా	మొత్తం రోడ్లు (కి.మీ)	ధ్వంసమైన కి.మీ	నిధులు(రూ.లక్షల్లో)
కరీంనగర్	406.77	163.96	7306.70
జగిత్యాల	298.36	1.90	8000.00
పెద్దపల్లి	42.46	0.41	531.50
రాజన్నసిరిసిల్ల	121.43	7.43	3050.35

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. మునుపెన్నడూ లేనిరీతిలో కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లలో పంచాయతీరాజ్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లాలో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈమేరకు పంచాయతీరాజ్ అధికారులు నష్టతీవ్రతను అంచనా వేసేందుకు సబ్ డివిజన్లలో రోడ్ల పరిస్థితిపై సర్వే నిర్వహించారు. జూలై నెలాఖరు నాటికి ఈ రోడ్ల దయనీయ పరిస్థితిపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

కరీంనగర్‌లో ఎక్కువ..

కరీంనగర్ రీజియన్‌లో పంచాయతీరాజ్ అధికారులు రోడ్ల నష్టంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీని ప్రకారం.. కరీంనగర్‌లో గరిష్టంగా 406.77 కి.మీల రోడ్లు, జగిత్యాలలో 298.36 కి.మీల మేర, రాజన్న సిరిసిల్ల 124.43 కి.మీ, పెద్దపల్లిలో కనిష్టంగా 42.46 కి.మీ మేర రోడ్లు ఉన్నాయి. ఇందులో కరీంనగర్‌లో 163 కి.మీ, జగిత్యాలలో 1.90 కి.మీ మేర, పెద్దపల్లిలో 0.41 కిమీ పాటు, రాజన్నసిరిసిల్లలో 7.43 కి.మీ మేర దెబ్బతిన్నాయి. ఇందులో కొన్ని రోడ్లు రోడ్ల ఉపరితలం కొట్టుకుపోగా, కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వీటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, అందుకు ఎంతమేరకు ఖర్చవుతుందన్న వివరాలపై అధికారులు తాత్కాలిక నివేదికను రూపొందించారని సమాచారం. దీని ప్రకారం.. జిల్లాలో మొత్తం మీద సుమారు 869 కి.మీలకు గాను 173.70 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి.

రూ.188 కోట్లు కావాలి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కరీంనగర్ రీజియన్‌లోని రహదారులకే తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని మరమ్మతులకు దాదాపు రూ.188.88 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదిక రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు ఇంకా అధికారుల ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆ తరువాత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే.. టెండర్లు పిలిచి మరమ్మతులు ప్రారంభించనున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగులు వంకలు ఆనుకుని ఉన్నగ్రామాల్లో రెండు మూడురోజులపాటు రాకపోకలు స్తంభించాయి. ఇలాంటి గ్రామాలకు మరమ్మతుల్లో తొలిప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా పల్లెలను పట్టణాలను కలిపేందుకు కీలకమైన.. బ్రిడ్జిలు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. వీటికి తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని కూడా ప్రాధాన్యం జాబితాలో చేర్చారు.

క్లుప్తంగా

రీ వెరిఫికేషన్‌లో పది జీపీఏ


గోపిక మధుప్రియ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ 2022–23 పదో తరగతి విద్యార్థిని బాధ గోపిక మధు ప్రియ పది జీపీఏ సాధించిందని స్కూల్ కరస్పాండెంట్ లతీఫ్ తెలిపారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గోపిక మధు ప్రియకు తక్కువ మార్కులు రావడంతో ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని పదోతరగతి విద్యాశాఖ బోర్డ్ డైరెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రీవెరిఫికేషన్‌లో 73 మార్కులకు 93 మార్కులు వచ్చినట్లు విద్యాశాఖ బోర్డు డైరెక్టర్ తెలిపారు. దీంతో 9.8 జీపీఏకు బదులు 10 జీపీఏ సాధించినట్లు కరస్పాండెంట్ లతీఫ్ వివరించారు. విద్యార్థినిని బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు అభినందించారు.

నియామకం


నియామక పత్రం అందజేసిన నాయకులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని మద్దిమల్ల గ్రామానికి చెందిన గుగులోత్ హరిలాల్ కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిలాల్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ బాలికలకు అండగా ఉంటాం

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం


నిత్యవసర వస్తువులు అందిస్తున్న అధికారులు

బోయినపల్లి(చొప్పదండి): పదేళ్ల క్రితం తల్లిని, రెండు రోజుల క్రితం తండ్రిని కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు ఆడపిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, వారికి అండగా ఉంటామని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కమటం అంజయ్య తెలిపారు. మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన వలస కూలీ గంధం శేఖర్ ఇటీవల చనిపోగా సోమవారం బాధిత కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ అనారోగ్యంతో మృతి చెందగా, ముగ్గురు బాలికలు అనాథలుగా మారినట్లు పత్రికల్లో చూసి స్పందించినట్లు తెలిపారు. ముగ్గురిని కేజీబీవీ పాఠశాలల్లో చేర్పించి చదివిస్తామని పేర్కొన్నారు. తక్షణ సాయంగా బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందించారు. అనాథ పిల్లల సమాచారం తెలిస్తే 1098కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విహారం.. విషాదం


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు


ప్రవీణ్ మృతదేహం

- వాగులో మునిగి పీజీ వైద్య విద్యార్థి మృతి
- ఫ్రెండ్‌షిప్‌డే రోజునే ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం

ఆదిలాబాద్‌టౌన్: ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతున్న వైద్యులు తోటి వైద్యుడైన మిత్రుడిని కాపాడలేకపోయారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న వైద్యులు తోటి స్నేహితులతో కలిసి ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలం కుంభఝురి–కంఠ గ్రామాల మధ్య ప్రవహించే సాత్నాల వాగు సమీపంలోని కోటిలింగాల వద్దకు వెళ్లారు. భూక్యా ప్రవీణ్‌కుమార్ రాథోడ్ వాగులో కాలుజారి గల్లంతు కాగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కళ్లకు గంతలు కట్టినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. ఆహ్లాదంగా గడిపిన సమయంలో తీసిన ఫొటోలు, వీడియోల్లో తలకు కర్చీఫ్ కట్టి ఉండటాన్ని చూసి అనుమానాలు వ్యక్తం చేశారు. ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని జైనథ్ సీఐ నరేశ్‌కుమార్ సూచించారు. డైరెక్టర్ ఛాంబర్‌లో విహార యాత్రకు వెళ్లిన వైద్యులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నతనం నుంచే చదువుల్లో మేటి

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన భూక్యా ఉస్మాన్ నాయక్ రాథోడ్–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శేఖర్‌నాయక్ వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీణ్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం రిమ్స్‌లో ఆర్థోపెడిక్ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు. మొదటి ప్రయత్నంలో ఎంబీబీఎస్ సీటు సాధించగా హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించారు. తర్వాత ముస్తాబాద్‌లోని పీహెచ్‌సీలో మూడు నెలలపాటు మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించాడు. పీజీ సీటు రావడంతో రిమ్స్‌లో చేరాడు. ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కొడుకు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్నేహితుల దినోత్సవం రోజే

తోటి స్నేహితులు 9 మంది సరదాగా గడిపేందుకు ఆదివారం విహారయాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు కుంభఝురి సమీపంలోని కోటి లింగాలను దర్శించుకున్నారు. వీరిలో నలుగురు పురుష వైద్యులు ఉండగా ఆరుగురు మహిళా వైద్యులు ఉన్నట్లు రిమ్స్ వర్గాలు తెలిపాయి. ఇంటికి బయల్దేరే క్రమంలో నీటిని దాటుతుండగా ప్రవీణ్ సెల్‌ఫోన్ నీటిలో పడిపోవడంతో దాన్ని తీసుకునేందుకు ప్రయత్నించి కాలు జారి నీటిలో పడ్డాడు. స్నేహితులు కార్తీక్, రాజు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్నేహితుడిని కాపాడాలంటూ పెద్ద ఎత్తున కేకలు వేసినా అప్పటికే ప్రవీణ్ గల్లంతయ్యాడు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, గ్రామస్తులు వాగు వద్దకు చేరుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మరి కొందరు వైద్యులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల ద్వారా గాలింపు చేపట్టారు. రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు ప్రవీణ్ భౌతికకాయాన్ని అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం డైరెక్టర్ ఛాంబర్ ఎదుట మృతదేహాన్ని ఉంచి నివాళులర్పించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, వెంకట్‌రెడ్డి, జాడే తానాజీ, అధికారులు పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

వేములవాడలో గుడిసెలు కనిపించొద్దు

- రూ.55 కోట్లతో 1,200 కుటుంబాలకు ఇళ్లు
- గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

వేములవాడ: వేములవాడలో ఒక్క గుడిసె కూడా కనిపించకుండా పేదలకు, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందించాలన్నదే తమ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. రూ.55 కోట్లతో 1,200 కుటుంబాలకు ఇళ్ల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఆఫీస్‌లో సోమవారం గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. ఈనెల 10వ తేదీ వరకు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 4,800 ఇళ్లు అందజేయనున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ పేదలకు సొంతింటి కలను నిజం చేయబోతున్నారన్నారు. 400 కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున, 75 గజాలున్న 496 కుటుంబాలకు రూ.5.30 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. బుడగ జంగాలు, పూసల కులస్తులు, సవరాల వాళ్లు, దాసరి కులాలు, పార్వతీపురం నివాసులకు నందికమాన్, అగ్రహారం, మిషన్ భగీరథ వద్ద ప్లాట్లు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను రెగ్యులరైజ్ చేయాలి

వేములవాడఅర్బన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ పలువురు హోంగార్డులు సోమవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసి విన్నవించారు. వేములవాడలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆశవర్కర్ మృతి

- మొర్రాపూర్ తండాలో విషాదం


పద్మ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మొర్రాపూర్‌తండాకు చెందిన ఆశవర్కర్ దండు పద్మ (40) గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పద్మ రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్సలో భాగంగా స్టంట్ వేయగా.. మరోసారి గుండెపోటుకు గురైంది. వైద్యులు ఆమెను రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ఆపరేషన్ జరిగిన గంటల వ్యవధిలోనే పద్మ మృతి చెందింది. పద్మ మృతదేహన్ని స్వగ్రామం మొర్రాపూర్‌కు తరలించారు. పద్దెనిమిదేళ్లుగా ఆశవర్కర్‌గా పనిచేస్తున్న పద్మ.. తండాలో ఎంతో మందికి నాణ్యమైన వైద్యం అందించేందుకు పనిచేసిందని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. భర్త నర్సింలు కూలీ పనులు చేస్తుండగా వీరికి పల్లవి, చిరంజీవి, వంశీ సంతానం.

పని ఒత్తిడితోనే పద్మ మృతి..

ఆశవర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, సీఐటీయూ నాయకుడు రమేశ్ మాట్లాడుతూ వేతనాలు లేకుండా, పనిభారంతోనే పద్మ గుండె జబ్బుకు గురైందని ఆరోపించారు. అధికారులు విధిస్తున్న పనులతో ఆశవర్కర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎంతో మంది ఆశ వర్కర్లు పనిభారం భరించలేక గుండె ఆగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గృహలక్ష్మికి దరఖాస్తులు స్వీకరించండి

- బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సాయం
- ప్రతి వారం 100 మందికి గొర్రెల పంపిణీ
- కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో గృహలక్ష్మి పథకంలో ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి గృహలక్ష్మి పథకంలో దరఖాస్తులు స్వీకరించాలని, దీనిపై పల్లెల్లో చాటింపు వేయించాలన్నారు. ఆగస్టు 10లోగా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించాలని, ప్రతీ నెల గొర్రెల యూనిట్లు అందించాలన్నారు. దళితబంధు రెండోదశలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, బీసీ సంక్షేమాధికారి రాఘవేందర్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఉద్యాన అధికారి జ్యోతి, మిషన్ భగీరథ ఈఈ జానకి, మైనార్టీ ఆఫీస్ ఓఎస్‌డీ సర్వర్‌మియా పాల్గొన్నారు.

స్వగ్రామానికి గల్ఫ్ మృతదేహం


లక్ష్మణ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన వలసజీవి మృతదేహం స్వగ్రామం చేరింది. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన జక్కుల లచ్చవ్వ–భూమయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. వీరికి వివాహాలు కావడంతో వేర్వేరుగా నివాసముంటున్నారు. రెండో కుమారుడు లక్ష్మణ్(40) పదేళ్లుగా దుబాయ్‌కు వెళ్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇంటికి వచ్చి అప్పు చేసి ఇల్లు కట్టాడు. మళ్లీ దుబాయికి వెళ్లి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తక్కువ వేతనం రావడంతో అప్పులెట్లా తీర్చాలన్న బెంగతో జూలై 31న తన రూంలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి మిత్రుల సహకారంతో ఆదివారం రాత్రి గల్ఫ్ నుంచి శవపేటిక ఇంటికి చేరింది. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య శకుంతల, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ కోరారు.

నోటరీ కొనుగోళ్లకు హక్కులు


ఎన్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో 'నోటరీ' ద్వారా కొనుగోలు చేసుకున్న ఒప్పందాలకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ సోమవారం తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మార్గదర్శకాలు జారీ చేశారని వివరించారు. నోటరీ దస్త్రాల ఆధారంగా జరిగిన స్థలాల కొనుగోలు ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అక్టోబరు 31 లోగా దరఖాస్తులు స్వీకరిస్తారని, 125 చదరపు గజాలలోపు స్థలానికి స్టాంపు డ్యూటీ ఉండదని, అంతకుమించి స్థలం ఉంటే.. మార్కెట్ ధరను వర్తింపజేస్తారని వివరించారు. గరిష్టంగా 3000 చదరపు గజాలలోపు వాటికి మాత్రమే నోటరీ వర్తిసుందని తెలిపారు. ఈ దరఖాస్తులను అన్నింటిని పరిశీలించి కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన నోటరీ అయితే జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుల తోపాటు నోటరీ దస్త్రాలు, లింకు డాక్యుమెంట్లు, ఆస్తి పన్ను రశీదులు, విద్యుత్ బిల్లులు, నీటి పన్ను రశీదులు ఇతర ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలోని నోటరీ కొనుగోలుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఖీమ్యానాయక్ కోరారు.

స్టడీ సర్కిల్ నుంచి ఎస్సైలుగా ఇద్దరి ఎంపిక


ఎస్సైలుగా ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి తదితరులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థుల్లో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికయ్యారు. స్టడీ సర్కిల్ అందించిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రేణిగుంట సాయికృష్ణ, కొప్పుల స్వాతిలను సోమవారం సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజేతలను స్ఫూర్తిగా తీసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ మెన్నేని హరీశ్‌రావు, సిబ్బంది సురేశ్, దివ్య, మురళి, ప్రసాద్, అంకని రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా గొర్రెల కాపరి కుమారుడు


అరుణ్‌కుమార్

బోయినపల్లి(చొప్పదండి): సివిల్ ఎస్సైగా మండలంలోని దుండ్రపల్లి గ్రామానికి చెందిన గుంటి అరుణ్‌కుమార్ ఎంపికయ్యాడు. గుంటి ఎల్లవ్వ–అంజయ్య కుమారుడు అరుణ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంటెక్ చేశాడు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల హైస్కూల్‌లో పదోతరగతి, కరీంనగర్ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, జేఎన్‌టీయూ కొండగట్టులో బీటెక్ చదివాడు. అరుణ్ సోదరుడు అనిల్ వ్యవసాయం చేస్తుంటాడు. సోదరి ప్రవళిక సైతం కొండగట్టు జేఎన్‌టీయూలో బీటెక్ చేస్తోంది. గ్రామంలో వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకంతో ఉపాధి పొందే రైతు కుటుంబానికి చెందిన అరుణ్ ఎస్సైగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న దశల వారీ ఉద్యమ కార్యచరణ వాల్‌పోస్టర్‌ను స్థానిక శివనగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర బాధ్యులు పాతూరి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 8 ఏళ్లుగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు , ఆరేళ్లుగా బదిలీలు నిర్వహించలేదని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల రిక్రూట్మెంట్ నిర్వహించకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీ, ధర్నా, సెప్టెంబరు ఒకటిన పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాకాల శంకర్‌గౌడ్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, కుమ్మరి మల్లేశం, వుత్తం విజయ్, మరాఠీ అజయ్‌కుమార్, గుండమనేని మహేందర్‌రావు, దుమాల రామనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కర్రల్ల రాజలింగం పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తి చాటిన గద్దర్


సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: ఉద్యమస్ఫూర్తిని చాటిన ప్రజాగాయకుడు గద్దర్ అని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కొనియాడారు. సోమవారం మున్సిపల్ ఆఫీస్ ఎదుట గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, తన గళంతో ఉద్యమకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లటౌన్: గద్దర్ మృతితో సిరిసిల్లలో పలుపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, కళాకారులు, కులసంఘాల ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాలు చేపట్టారు. గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చీటి ఉమేశ్‌రావు, ఆకునూరి బాలరాజు, సూర దేవారాజు పాల్గొన్నారు.

కవులు..కళాకారుల ఆధ్వర్యంలో..

ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్(ఐటీఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో గద్దర్‌కు సంతాప కార్యక్రమం చేపట్టారు. సినీగాయకుడు మాట్ల తిరుపతి, జీఎల్ నాందేవ్, ఆకునూరి దేవయ్య, మహేందర్, నాగరాజు, రాజు, శంకర్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, వెంగల లక్ష్మణ్, దేవానందం, అశోక్, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సత్యనారాయణ, దేవదాసు, మల్లాజి పాల్గొన్నారు.

మూగబోయిన ప్రజాగొంతుక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజా గొంతుక మూగబోయిందని ఎల్లారెడ్డిపేట ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీటీసీ ఆఫీస్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిళ్ల నాగరాణి, ఎనుగందుల అనసూయ, సర్పంచ్ భూక్య శంకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య సీత్యానాయక్, మందాటి రాము, గోషిక దేవదాసు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సేవలు మరువలేనివి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గద్దర్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, గండికోట రవి, చెన్ని బాబు, మల్లారెడ్డి, రొడ్డ రామచంద్రం, పర్శరాములు, ఉప్పుల రవి, రాజునాయక్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

నందికమాన్ వద్ద..

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ వద్ద మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, కూస రవి, ఎర్రం రాజు, లింగయ్య, కిరణ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. మండలాధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని), నాయకులు లింగాల భూపతి, ఆసాని సత్యనారాయణరెడ్డి, నేరెళ్ల నర్సింగంగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల పర్శరాం, మునిగెల రాజు, ఎడమల ప్రతాపరెడ్డి, అరెపల్లి బాలు, భరత్, రాజు, పరుశురాం, ఎండీ.సలీం, చిలుక శ్రీను, ఎండీ.ఉస్మాన్, రఫీక్ పాల్గొన్నారు.

బడుగువర్గాలకు తీరని లోటు

సిరిసిల్లకల్చరల్: గద్దర్ అకాల మరణం బడుగు, బలహీనవర్గాల ప్రజలకు తీరని లోటు అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి పేర్కొన్నారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చసిన కార్యక్రమంలో నివాళి అర్పించారు. సంఘం ఉపాధ్యక్షుడు బూర దేవానందం, వెంగల లక్ష్మణ్, జిందం అశోక్, మహేశ్, గణేశ్, వెంకన్న పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు


వేములవాడ అర్బన్: నివాళి అర్పిస్తున్న పొన్నం, ఆది


ఎల్లారెడ్డిపేట: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సిరిసిల్లకల్చరల్: నివాళి అర్పిస్తున్న రచయితలు